నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

వెదురు బుట్ట అందజేత

నవతెలంగాణ-నిర్మల్

నీతి అయోగ్‌లో భాగంగా పెంబి మండలంలోని కొలాంగూడ, పసుపుల గ్రామ పంచాయితీలకు చెందిన గిరిజనులు చేతితో వెదురు బుట్టలను అల్లారు. నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వెదురు బుట్టను అందజేశారు. ఈ సందర్భంగా పెంబి మండలంలో నీతి ఆయోగ్ ఎంపిక చేసిన బ్లాక్‌లలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి పురోగతిపై కలెక్టర్‌కు వివరించారు.



నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. నారాయణఖేడ్‌లో మాత్రం రూ.2400 మాత్రమే ఇచ్చారన్నారు. రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారన్నారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నిరక్షరాస్యులే..అయినా ఆదర్శనీయులే..!

- ఓట్ల పండుగలో ఆదర్శంగా నిలిచిన 'గిరి' గ్రామాలు

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కొన్ని సందర్భాలలో ఒక్క ఓటే అభ్యర్థుల భవితవ్యాన్ని మార్చిన సంఘటనలు ఉన్నాయి. అలాంటి ఓటు విషయంలో కొందరు విద్యావంతులు కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా దూరంగా ఉంటున్నారు. కాని సిర్పూరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాలలో ఉన్న నిరక్షరాస్యులు 90 శాతానికి పైగా ఓటు హక్కు వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం సిర్పూరు నియోజకవర్గం. నెంబర్ వన్ నియోజకవర్గంలో నెంబర్ వన్ ఓటరు నివసించే గ్రామం కాగజ్‌నగర్ మండలం మాలిని. ఈ గ్రామం బాహ్యాప్రపంచానికి దూరంగానే ఉంటుంది. ఈ గ్రామంలో నిరక్షరాస్యులే అధికంగా ఉన్నా, రెండు రోజుల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మాత్రం చైతన్యాన్ని ప్రదర్శించారు. ఈ గ్రామంలోని పోలింగ్ కేంద్రం (నెం.001)లో 402 మంది ఓటర్లుండగా 372 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ గ్రామంలో 92.54 శాతం పోలింగ్ నమోదైంది. దీనికి సమీపంలోనే ఉన్న మరో గిరిజన గ్రామం మానిక్‌పటార్. ఈ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో (నెం.002) కూడా గిరిజనులు నిరక్ష్యరాస్యులే. ఈ గ్రామంలో 93 మంది ఓటర్లుండగా, 85 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 91.40 శాతం పోలింగ్ నమోదైంది. ఇదే మండలంలోని మరో గిరిజన గ్రామం గోంది (బూత్ నెం.114)లో 159 మంది ఉండగా 145 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 91.19 శాతం పోలింగ్ నమోదైంది. సిర్పూరు (టి) మండలం పూసిగూడ గిరిజన గ్రామమే. ఇక్కడ 131 మంది ఓటర్లకు గాను 118 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 90.08 పోలింగ్ శాతం నమోదైంది. చింతలమానెపల్లి మండలం కేతిని గ్రామంలో కూడా గిరిజనులే అధికంగా నివసిస్తుంటారు. ఇక్కడ 101 మంది ఓటర్లుండగా, 94 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవలం ఏడుగురు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఈ గ్రామంలో 93.07 పోలింగ్ శాతం నమోదైంది. దహెగాం మండలం పార్వతిపేట్ గిరిజన గ్రామంలో 185 మంది ఓటర్లకు గాను 169 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 91.35 పోలింగ్ శాతం నమోదైంది. పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ (నెం. 251ఎ)లో 139 మందికి గాను 134 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవలం ఐదుగురు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఇక్కడ 96.40 శాతం పోలింగ్ నమోదైంది.



కాగజ్‌నగర్ మండలం మానిక్‌పటార్‌లో ఓటు వేసేందుకు క్యూ కట్టిన గిరిజనులు

రేచినిలో 100 శాతం

బెజ్జూరు మండలం రేచిని పోలింగ్ కేంద్రం (నెం.225ఎ)లో 100 శాతం పోలింగ్ నమోదైంది. ఈ కేంద్రంలో 133 మంది ఓటర్లుండగా అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 67 మంది పురుషులు, 66 మంది మహిళలు ఉన్నారు.

సఫలమైన అధికారుల కృషి

గిరిజన గ్రామాలలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు చేసిన కృషి ఫలించిందనే చెప్పవచ్చు. ముఖ్యంగా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి గిరిజన గ్రామాలలో పర్యటించి ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. కింది స్థాయి సిబ్బందిని కూడా గ్రామాలకు పంపించి ఓటర్లను చైతన్యం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ సైతం పలు గిరిజన గ్రామాలకు వెళ్లి భయం లేకుండా ఓటు వేయాలని సూచించారు. ఈ మేరకు వారు చేసిన కృషి ఫలితమే పోలింగ్ శాతం పెరగడానికి కారణమని చెప్పొచ్చు.



మానిక్‌పటార్‌లో ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారి (ఫైల్)



మానిక్‌పటార్ గ్రామానికి బైక్‌పై వెళ్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

భగీరథ ప్రయత్నం..!

- అడుగంటుతున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు
- మిషన్ భగీరథ పంప్ హౌస్ తేలిన వైనం
- ప్రొక్లెయిన్లతో కాలువలు తవ్వుతున్న అధికారులు



నవతెలంగాణ-హాజీపూర్


మిషన్ భగీరథ నీటికి కష్టకాలం ఎదురవుతోంది. ఈ పథకం ప్రారంభమై ఆరేండ్లవుతున్న క్రమంలో ఎన్నడూ ఇంతటి క్లిష్ట పరిస్థితి ఎదురుకాలేదు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకు చేరుకుంటోంది. 20 టీఎంసీల కెపాసిటీ గల ప్రాజెక్టులో ప్రస్తుతం 5టీఎంసీల మీరు మాత్రమే ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీరు పాత గోదావరి లెవల్‌కు చేరి ఒడ్లు కనబడుతున్నాయి.

అధికారుల 'భగీరథ' ప్రయత్నం

మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు ఎల్లంపల్లి నుండే మిషన్ భగీరథ పథకానికి నీరు తరలిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో పంప్ హౌస్ ఏర్పాటు చేసి భారీ పంప్‌ల ద్వారా నీటిని తోడుతూ సమీప బుగ్గ గట్టు గుట్టపై భారీ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా మూడు నియోజకవర్గాలకు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పథకం రాక ముందు నుండి ఈ ప్రాజెక్టు ద్వారానే మంచిర్యాల పట్టణానికి తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో పంప్ హౌస్‌లో బయటకు కనిపిస్తోంది. దీంతో అధికారులు బుధవారం భారీ ప్రొక్లెయిన్లతో మీటర్ల దూరం వరకు కాలువలు తోడుతూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుండే హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, ఎన్టీపీసీలకు నీటిని నిత్యం తరలించాల్సి ఉంది. ప్రస్తుతం 5టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో మరో రెండు మూడు రోజుల్లో ఇప్పుడు తవ్వుతున్న కాలువలు కూడా నిండుకునే పరిస్థితులు ఉన్నాయి. ఏదేమైనా ఈ వేసవి పూర్తయ్యే వరకు మూడు నియోజకవర్గాల ప్రజలకు తాగు నీరు అందడం కష్టంగానే ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లు, వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలు, సీఎంఆర్ సరఫరా ఇతర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, క్లీనింగ్ మిషన్, గన్నీ బ్యాగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని, తరలింపుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో కేంద్రాలను పర్యవేక్షించి రోజూ వారి రిపోర్టులను అందజేయాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఎంఆర్ సరఫరాపై మిల్లుల వారీగా చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఎస్‌వో నందిత, డీఎం సివిల్ సప్లయ్ శ్రీకళ, డీసీవో నర్సయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం



నవతెలంగాణ-హాజీపూర్

వివాహేతర సంబంధం వ్యక్తి హత్యకు దారి తీసింది. ఎస్సై సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన మల్యాల నరేష్(32) గతంలో పెట్రోల్ పంప్‌లో పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మహిళతో కొంత కాలంగా వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయమై నరేష్ భార్య దూరంగా ఉంటుంది. వివాహేతర సంబంధం కలిగిన మహిళ కూడా భర్తకు దూరంగా ఉంటుంది. వీరిద్దరికి కూతుళ్లు ఉన్నారు. వీరి సంబంధం విషయమై పలు మార్లు పంచాయితీలు కూడా జరిగాయి. అయినా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో సదరు మహిళ సోదరుడు చైతన్య గ్రామంలో తమ కుటుంబం పరువు పోతోందని ఇరువురిని హెచ్చరించాడు. అయినా వినకపోవడంతో నరేష్ మంగళవారం రాత్రి మహిళతో ఉండడంతో గమనించిన చైతన్య కోపోద్రిక్తుడై నెట్టేశాడు. కింద పడిన నరేష్‌పై పెద్ద బండరాయితో మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై గోపతి సురేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని తండ్రి మల్యాల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి దూరంగా ఉంటున్న భార్య నిరీష, కూతురు(8) ఉంది.

ఎక్కడ ప్లస్..ఎక్కడ మైనస్..!

- లెక్కల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల తలమునకలు

నవతెలంగాణ-మంచిర్యాల

పార్లమెంట్ ఎన్నికలు ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరడ తో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా లెక్కల్లో మునిగి తేలుతున్నారు. తమ గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతూ పోలింగ్ సరళిని తెలుసుకుంటున్నారు. ప్రాంతాల వారీగా ఎక్కడ ప్లస్, ఎక్కడ మైనస్ అయిందో అభ్యర్థులు కాగితాలపై లెక్కలు వేసుకుంటున్నారు. వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలతో గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. ఒక వైపు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూనే మరో వైపు ఏ నియోజకవర్గంలో ఎంత శాతం ఓట్లు పోల్ అయ్యాయి..ఎక్కువ మెజారిటీ వచ్చే నియోజకవర్గాలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో అంచనాల ప్రకారం కాకుండా తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడంతో అభ్యర్థులు కాస్త నారాజులో ఉన్నట్లు తెలుస్తోంది.



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పోలింగ్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో మాట్లాడి ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. తాయిలాలతో ఓటర్లను మచ్చిక చేసుకోగా వారు ఓటేశారా? లేదా ఆలోచనల్లో పడ్డారు. ఇచ్చిన డబ్బులు నాయకులు అందరికి పంచారా లేదా అనే అనుమానాలు సైతం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన వారిపై ప్రత్యేక దృష్టి

రెండు నెలల క్రితం నుండి కొత్తగా పార్టీ కండువాలు కప్పుకున్న వారిపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆలోచనతో కొందరు అభ్యర్థులు లక్షలు పెట్టి వేరే పార్టీ నాయకులను తమ పార్టీలో చేర్చుకున్న సంగతి తెలిసిందే.

పెద్దపల్లి నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఒక్కో నాయకుడికి ఒక్కో రేటు ప్రకటించి పార్టీలో చేర్చుకున్నట్టు చర్చించుకుంటున్నారు. కొత్తగా పార్టీల్లో చేరిన నాయకుల ద్వారా ఎన్ని ఓట్లు పడ్డాయి..వారి చేరికతో లాభం జరిగిందా? లేక నష్టం జరిగిందా? అనే కోణంలోను అభ్యర్థులు సమాలోచనలు చేస్తున్నారు. కొత్త, పాత నాయకులు మనస్ఫూర్తిగా పని చేస్తే విజయం తథ్యం అనే భావనలో ఉన్న అభ్యర్థులకు పోలింగ్ రోజు కొత్తగా కండువాలు కప్పుకున్న వారు కనిపించకపోవడంతో పలు అనుమానాలు మొదలయ్యాయి. ఆ గట్టు నుండి ఈ గట్టుకు వచ్చిన వారి నుండి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయో అనే ఆలోచనల్లో పడ్డారు.

క్షేత్ర స్థాయి నుండి వచ్చిన నివేదికలపై లెక్కలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఎవరి లెక్కలు ఎలా ఉన్నా, గెలుపై అందరూ ధీమా వ్యక్తం చేస్తున్నా జూన్ 4న అభ్యర్థుల భవితవ్యం వెల్లడి కానుంది. ఓటరు మహాశయుడు ఎవరి వైపు మొగ్గు చూపాడో తేలిపోనుంది.



పార్టీ నాయకులతో సమాలోచనలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్



పార్టీ నాయకులతో సమావేశమైన గోమాస శ్రీనివాస్

డెంగ్యూ నియంత్రణపై ప్రత్యేక చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్
- డెంగ్యూ ప్రచార కరపత్రాలు, వాల్‌పోస్టర్లు విడుదల



ఫ్లెక్సీ విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లా మలేరియా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లులతో కలిసి ఫ్లెక్సీ, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ వ్యాధి నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు డెంగ్యూ వ్యాధిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని సదుపాయాలు, చికిత్సలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నియంత్రణ, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు పంపించడం జరిగిందని తెలిపారు. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధి వస్తుందని, తీవ్రమైన తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం జరుగుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తగిన చికిత్స తీసుకోవాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా నివాస ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగు కాలువలలో నీరు నిల్వ ఉన్నట్లయితే కిరోసిన్ కాని, కాలిన నూనె కాని చల్లాలని, ఇంటి పరిసరాలలో ఎక్కడా చెత్త లేకుండా శుభ్రపర్చుకోవాలని, ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రైడే పాటించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించేలా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద మహిళా ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధి లక్షణాలను పరిశీలించి, ఉన్నట్లయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నివాస ప్రాంతాలు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సాంకేతిక పర్యవేక్షకులు సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

నర్సరీని పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామ నర్సరీని బుధవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మొక్కలకు సకాలంలో నీళ్లు పడుతూ మొక్కలు ఎండి పోకుండా చూడాలని గ్రామపంచాయతీ ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. విధి నిర్వహణలో



నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని తెలిపారు. మండలంలోని నర్సరీలన్నీ ఉపాధి హామీ సిబ్బందితో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. నర్సరీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మొక్కలను కాపాడేందుకు, మండల ప్రజలు కూడా సహకరించి, తమ కర్తవ్యంగా భావించాలన్నారు.

బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న పేషేంట్ కేర్ కార్మికురాలు గణపతి లక్ష్మిని మానసికంగా ఒత్తిడికి గురి చేసి, పాయిజన్ తాగేటట్టు చేసిన సూపర్ వైజర్‌పై వెంటనే చట్ట రీత్యా చర్యలు తీసుకొని రిమ్స్ నుంచి తొలగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం రిమ్స్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాణాలతో పోరాడుతున్న గణపతి లక్ష్మికి న్యాయం జరిగేంత వరకు ఏఐటీయూసీ యూనియన్ తోడుండి పోరాడుతుందని అన్నారు. సంబంధిత అధికారులను ఏజెన్సీ వారిని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు దొంగ్రే చందు, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండి ఖాసీం, రిమ్స్ బ్రాంచ్ అధ్యక్షురాలు సంగీత, యూనియన్ జిల్లా నాయకులు సంతోష్, రాజేందర్ సింగ్, సైఫ్ ఖాన్, రాథోడ్ రవీందర్, నర్సమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

- పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిన అధికారులు



నవతెలంగాణ-లోకేశ్వరం

నవతెలంగాణలో బుధవారం ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు చేపట్టారు. బుధవారం పారిశుధ్య లోపం.. పట్టించుకోని అధికారులు.. అనే కథనానికి స్పందించిన అధికారులు పొట్టపల్లి (ఎం) గ్రామాన్ని సందర్శించారు. మండలంలోని హద్గాం గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన పొట్లపల్లి(ఎం) గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యకలాపాలను లోకేశ్వరం ఎంపీడీఓ సోలమన్ రాజ్, పంచాయతీ కార్యదర్శి భోజన్నలు సందర్శించారు. గ్రామంలోని మురికి కాలువ పూడిక సమస్యను పరిశీలించి పూడిక పనులను గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బందితో, జేసీబీ సాయంతో దగ్గర ఉండి పనులు చేయిస్తూ కార్మికులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్య తీరిందని గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తంచేశారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధిస్తుంది : జోగు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు సైలెంట్ ఓటింగ్ పెద్ద ఎత్తున జరిగిందని, తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు భారీ మెజారిటీతో విజయం సాధించనున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని, పోలింగ్ సరళిని విశ్లేషించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారని అన్నారు. నిద్రాహారాలు మాని గెలుపు కోసం కష్టపడ్డ వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పది లక్షలకు పైగా మంది లబ్ధిదారులు వివిధ పథకాల ఫలాలు పొందారని తెలిపారు. వారిలో ఎక్కువ శాతం మంది కారు గుర్తుకే ఓటు వేశారని, సైలెంట్ ఓటింగ్ పెద్ద ఎత్తున జరగడంతో బీఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు డబ్బులు వెదజల్లినా, ప్రజలు తమ వైపే ఉన్నారని అన్నారు. అధికార యంత్రాంగం సైతం మద్యం, నగదు పంపిణీ జరిగినప్పటికీ చూసి చూడనట్టు వ్యవహరించిందని ఆరోపించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేష్, సాజీదోద్దీన్, మెట్టు ప్రహ్లాద్ ఇజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, భూమన్న, పర్వీన్ ఫెరోజ్, జోహూర్ భాయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

నాణ్యతా ప్రమాణాలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జూన్ 5లోగా పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, మరుగుదొడ్లకు, నీటి సదుపాయం, కాంపౌండ్ వాల్ రిపేర్లు, విద్యుత్ పనులు, స్లాబ్‌ల మరమ్మతులు, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్స్ వంటి పనులు, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పనుల ప్రారంభం ముందు, తర్వాత ఫొటోలతో కూడిన నివేదికలను సమర్పించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల వారీగా చేపట్టిన పనులు, మరమ్మతులకు సంబంధించిన వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రవీందర్ రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్, మున్సిపల్ శాఖల అధికారులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంలో దేవపటార్

- రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు
- రేషన్ కోసం ఐదు కిలోమీటర్ల ప్రయాణం



నవతెలంగాణ-నార్నూర్

స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇంకా కొన్ని గ్రామాలు అభివృద్ధికి అమడ దూరంలోనే ఉన్నాయి. తరాలు మారిన తమ స్థితిగతులు మారడం లేదని గిరిజనులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మరపగూడ గ్రామపంచాయతీ పరిధిలోని దేవపటార్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దేవపటార్‌లో సుమారు 40 కుటుంబాలు, రెండువందలకుపైగా జనాభా కలిగి ఉంటుంది. ఇప్పటి వరకు తమ గ్రామానికి ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎక్కువగా ఆంద్, గిరిజనులు జీవిస్తారు. స్వాతంత్రం రాక ముందు నుంచి గ్రామంలో నివసిస్తున్న తమకు ప్రతి ఐదేండ్ల కొకసారి పాలకులు మారుతున్న అభివృద్ధి అభివృద్ధి జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో సమయంలో ఓట్ల కోసం హామీలు మరిచి పోతున్నారని అన్నారు. గ్రామానికి ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం లేదని అన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు లేవన్నారు. అంగన్‌వాడీ భవనం లేదన్నారు. పాఠశాల భవనం ఒక్కటే ఉందని అన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఒకే ఒక సీసీ రోడ్డు, అదికూడా గుంతల మయంగా ఏర్పడిందన్నారు. గ్రామస్తులు రేషన్ సరుకుల కోసం దాదాపు గ్రామం నుంచి ఐదు కిలో మీటర్ల దూరం ప్రయాణించి నాగల్‌కొండ గ్రామం నుంచి రేషన్ సరుకులు తీసుకొని రావాల్సివస్తోందని పేర్కొన్నారు. వర్షాకాలంలో రోడ్డు, బురదమయంగా మారుతుంది. సరిగా లేక సమయానికి అంబులెన్స్ రాకపోవడంతో పలువురు మృతి చెందిన సంఘటన ఉన్నాయని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

చికల్‌కర్ జనార్ధన్, గ్రామపటేల్



మా గ్రామానికి రావాలంటే మూడు కిలో మీటర్లు రోడ్డు సరిగా లేదు. వర్షాకాలంలో పోవడానికి రావడానికి ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు సరిగా లేకపోవడంతో అనేక సంఘటనలు జరిగాయి. దీనితో పాటు గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. అధికారులు సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

ఐదు కిలో మీటర్ల దూరం నుంచి రేషన్ తీసుకొస్తున్నాం :

రిటే నాందేవ్



ప్రతి నెల మేము రేషన్ సరుకులు తీసుకొని రావాలంటే ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లి నాగల్‌కొండ పాత గ్రామపంచాయతీ నుంచి తీసుకొస్తున్నాం. అంత దూరం నుంచి తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్నాం. అదికారులు గమనించి మా గ్రామపంచాయతీలో రేషన్ ఇచ్చేవిధంగా నూతన దుకాణాన్ని మంజూరు చేయాలి.

రోడ్లపై షెడ్లు వేయడం సరి కాదు

- మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రజలకు ఇబ్బంది కలిగేలా చిరు వ్యాపారులు రోడ్లపై షెడ్లు వేసుకోవడం మంచిది కాదని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలో జనాభా గతం కంటే పదింతలు పెరిగిందని ఈ క్రమంలో చిరువ్యాపారులు ఎవరికి వారుగా ఆలోచించి, షెడ్లు రోడ్లపైకి రాకుండా తమ వ్యాపారం సాగించుకోవాలని సూచించారు. అటవీశాఖ కార్యాలయం పక్కన రోజువారిగా ఉదయం టిఫిన్ సెంటర్ నడుపుకునే ఓ చిరువ్యాపారి విషయంలో బుధవారం సమస్య తలెత్తడంతో చైర్మెన్ ఆయనకు సర్ది చెప్పారు. ఈ నేపథ్యంలో చైర్మెన్ మాట్లాడారు. కొందరు చిరువ్యాపారులు. రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిండం మంచిది కాదని అన్నారు. అంగడి బజార్ స్థలాన్ని వదిలి ఎప్పుడు రద్దీగా ఉండే పోలీసు స్టేషన్ వెళ్లే రహదారిపై దుకాణాలను పెట్టడం సరి కాదన్నారు. ఫారెస్ట్, తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకు ఇరువైపుల షెడ్లు, తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు సాగించడంవల్ల ప్రజలకు, వాహనదారులు, అంబులెన్స్ రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. ఏదైనా వాహనం అదుపు తప్పితే సదరు వ్యాపారి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని అన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించక ముందే ఎవరికి వారుగా సదరు వ్యాపారులు రోడ్లపై ఉన్న తోపుడు బండ్లు, షెడ్ల ను తీసేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయిని సంతోష్, సతీష్‌రావు, ఎల్.కిషన్, ఎం.గంగధర్, నాయిని రాజేశ్వర్, కరిపే శ్రీనివాస్, దివాకర్ ఉన్నారు.

కంది వ్యాఖ్యల పట్ల భగ్గుమన్న కాపు సంఘం

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- కంది దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రాజకీయాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత రాజకీయ చిచ్చు రాజుకుంది. ఇటీవల ప్రజా సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలను మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. గతంలోనూ గండ్రత్ సుజాతను ఉద్దేశించి ఆయన ఇదే రీతిలో వ్యాఖ్యలు చేశారంటూ ఆందోళనకు దిగారు. బుధవారం స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో సభ్యులంతా ఒక చోట చేరిన అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కంది ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నినాదాలతో హోరెత్తించారు. కంది కాదు పంది అని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కాళ్ల విఠల్ మాట్లాడుతూ గండ్రత్ సుజాతపై కంది చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. గతంలోనూ ఇదే విధంగా మాట్లాడారని గుర్తు చేసిన ఆయన ఇటువంటి ఘటనలు పునరావృతమైతే మున్నూరుకాపు సమాజం సహించదని స్పష్టం చేశారు. కంది వ్యాఖ్యలను సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అనుచిత వ్యాఖ్యల పట్ల వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, ఉష్కం రఘుపతి, గండ్రత్ మహేందర్, సాయి, బండారి సంతోష్, గండ్రత్ సంతోష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం... అపార నష్టం...

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఈదురు గాలులతో కురిసిన గాలివాన బీభత్సం కారణంగా తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు, పశువుల పాకలు, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడం వల్ల పలు గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడింది. బుధవారం ఉదయం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలు రోడ్డుపై పడటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి ముద్దవుతుందని, అధికారులు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా రాగల రెండు మూడు రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణ ఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి నారాయణఖేడ్ ఆర్డీఓ నిబంధనలకు విరుద్ధంగా రెమ్యునరేషన్ తగ్గించి చెల్లించారన్నారు. దీనిని నిరసిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగితే, వారిపై నిర్దాక్షిణ్యంగా లాఠీ చార్జి చేయించారని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ.600, ఓపీఓలకు రూ.400, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.61ని ఈ నెల 11న విడుదల చేసిందని, కానీ నారాయణ ఖేడ్ ఆర్డీఓ రాష్ట్ర ప్రభుత్వ జీఓకు భిన్నంగా రెమ్యునరేషన్ తగ్గించి చెల్లించారని పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారని, తమకు కూడా జీఓ ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని కోరారు. అయితే, ఆర్డీఓ నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించకపోగా నిరసనకు దిగిన ఉపాధ్యాయులపై పోలీసులను ఉసిగొల్పి లాఠీ చార్జి చేయించారని, ఇది హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలింగ్ విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేసిన ఉపాధ్యాయులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులైన ఆర్డీఓ, ఇతర అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. లేనిపక్షంలో ఆందోళను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉట్నూర్

డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో జరిగిన గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దళితుల, ఆదివాసీ గిరిజనుల, సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీసే కుట్ర పన్నుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా కలిసి కట్టుగా ఉండి ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, ఆ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉందని అన్నారు. అంబేద్కర్ దయవల్లే తాను ఎమ్మెల్యే అయ్యానని పేర్కొన్నారు. యువత బుద్ధుడు, అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోని వారు చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కిన్వట్ సామాజిక కార్యకర్త కుడ్మెత వికాస్, దళిత సంఘాల నాయకులు భరత్ వాగ్మారే, దళిత, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

మద్యానికి బానిసైన ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గుగ్గిల పొచ్చన్న కుమారులతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. కొన్నాండ్లుగా అతిగా తాగుడుకు బానిసయ్యాడు. అప్పులు పెరిగిపోవడంతో తాగుడుకు డబ్బులు దొరకని పరిస్థితి రావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి సమయంలో గ్రామ సమీపంలోని వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రోజున గ్రామస్తులు చూసి కుటుంబీకులకు తెలిపారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఉన్నారు. భార్య రమబాయి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రదీప్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమయానికి ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు హాజరు కాకపోవడంతో ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికను సభలో చదివి వినిపించారు. ముఖ్యంగా వేసవి ఎండలు తీవ్రం అవుతున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ సూచించారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కురిసిన వడగండ్ల వాన

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎండా మేడిమి నుంచి కొంత ఉపశమనం లభించింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం ముందు కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్, కోర్టు రోడ్డు, అటవీ శాఖ కార్యాలయం, ఎన్జీఓ కాలనీలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఆసిఫాబాద్ : జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష రాసే విద్యార్థులకు రూ.1000 అపరాధ రుసుముతో ఈనెల 16 వరకు గడువు పెంచినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్‌బీఐఈ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే అవకాశం ఉందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-జైనూర్

జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, కెరమెరి మండలాలకు కలిపి ఉన్న ఏకైక పాఠశాల, కళాశాల తెలంగాణ రాష్ట్ర మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మోడల్ కళాశాల సిర్పూర్(యు) ఇంటర్ మీడియట్ అడ్మిషన్ కోసం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుండి అందిస్తున్న ఉచిత విద్యావ్యవస్థను సద్వినియోగం చేసుకోవడానికి ఇంగ్లీష్ మీడియం కళాశాలలో మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో పాటు హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు గడువు ఉందన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మూల అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



తరగతి బోధిస్తున్న డీఈఓ అశోక్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

భౌతిక, రసాయనశాస్త్రాలలో మూల అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. కాగజ్‌నగర్‌లోని డివిజనల్ వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రసాయనశాస్త్రం బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు ఈ కోచింగ్‌కు హాజరు కావడం సంతోషకరమన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ ప్రేంకుమార్, కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ కటకం మధూకర్, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు మామిడాల తిరుపతయ్య, దుర్గం మోహన్ పాల్గొన్నారు.



కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

జైనూర్ ఘటన నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న హిందూ వాహిని నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూర్ మండల కేంద్రంలో చిన్నచిన్న కారణాలతో హిందువుల కుటుంబాలపై ముకుమ్మడిగా దాడి చేసిన దుండగులని కఠినంగా శిక్షించాలని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో దాదాపుగా 500 మందితో ఒడ్డెరగూడలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తునామనీ, ఇలాంటి ముకుమ్మడి దాడులు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు దుండగులని కఠినంగా శిక్షించాలన్నారు. అసలు ఈ గొడవలకి కావడానికి కారణాలపై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల ప్రణయ్, టీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ పాల్గొన్నారు.

20న ఆలయ భూముల కౌలు వేలం

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేశవ ఆలయం ఆధీనంలో ఉన్న భూములు సంవత్సరం కౌలు ఇవ్వడానికి ఈనెల 20న జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వాడలో గల మినీ ఫంక్షన్ హాల్‌లో వేలం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.50 వేల ముందుగానే ధరావత్ సొమ్ముగా చెల్లించాలన్నారు. వేలంపాట పూర్తయిన తర్వాత పూర్తి డబ్బు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 9618307962, 9885489088, 9908867600, 9491344496 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుండి వేసవి క్రీడా క్యాంపులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుండి మే 31 వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాలలో వేసవి క్రీడ క్యాంపులను 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరంలో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనపరిచిన 60 మంది బాలురులు, 60 మంది బాలికలను ఇప్పటికే ఎంపిక చేశామని, ఎంపికైన క్రీడాకారులందరూ సకాలంలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్ ఇలా 6 అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరం ఉదయం, సాయంత్రం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఈవీఎం గోదాంకు ఓటింగ్ యంత్రాల తరలింపు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన రిజర్వు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భారీ బందోబస్తు మధ్య తరలించి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఈవీఎం గోదాంలో భద్రపరుస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అడిషనల్ కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో లోక్‌సభ ఎన్నికల కోసం రిజర్వులో ఉంచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించినవి పీటీజీ బాలుర పాఠశాల, సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించినవి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బందోబస్తు మధ్య తరలించి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఈవీఎం గోదాంలో భద్రపరుస్తామన్నారు. గోదాం వద్ద పటిష్ట భద్రత కల్పించామని తెలిపారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, డిప్యూటి తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలు పోలీసుల విజయం

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరగడం పోలీసుల విజయమని, దీనికి జిల్లాలోని పోలీసులను అభినందిస్తున్నట్లు ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలు నిర్వహించడానికి నిర్విరామంగా పోలీస్ సిబ్బంది పనిచేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా 2000 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. ఎన్నికల నిర్వహణలో వాహనాల తనిఖీలు, కార్డన్ సెర్చ్ ద్వారా పోలీసులు 182 కేసులు నమోదు చేశారని తెలిపారు. 182 కేసులలో రూ.2 కోట్ల 4 లక్షల 72 వేల 950 నగదు, రూ.2,40,140 విలువ చేసే 9.588 కిలోల గంజాయి, 14 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 1315లీటర్ల మద్యం వీటి విలువ రూ.6,54,878 ఉంటుందని తెలిపారు. వీటితో పాటు 311కేసుల్లో 717 మందిని 107 సీఆర్‌పీసీ, 110 సీఆర్‌పీసీ, 151 సీఆర్‌పీసీ సెక్షన్స్, 10 ఎన్‌బీడబ్ల్యూ కింద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

జైనూర్‌లో భారీ వర్షం





నవతెలంగాణ-జైనూర్

మండలంలో మధ్యాహ్నం మూడు గంటల నుండి భారీ వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో భారీ వర్షం కురవడంతో లింగాపూర్ మండలంలోని నడ్డంగూడ గ్రామంలో జాదవ్ నాందేవ్ ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. జాదవ్ ఆనంద్‌రావు పెంకుటిల్లులోని నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. అలాగే పలువురి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. ఇండ్లపై విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో లింగాపూర్ మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షాల దాటికి రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తూకంలో మోసంపై డీసీఏఓ విచారణ

- కొనుగోలు కేంద్రం నిర్వాహకుని తొలగింపు
- సస్పెన్షన్‌కు నివేదిక అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దహెగాం మండలం ఒడ్డుగూడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను తూకంలో మోసం చేస్తున్న వైనంపై బుధవారం జిల్లా సహకారశాఖ అడిట్ అధికారి (డీసీఏఓ) మహ్మద్ రబ్బాని విచారణ చేపట్టారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తూకంలో మోసం చేస్తుండడాన్ని గమనించిన రైతులు మంగళవారం అక్కడే ధర్నా చేపట్టిన విషయం తెల్సిందే. దీనిపై స్పందించిన జిల్లా సహకారశాఖ అడిట్ అధికారి మహ్మద్ రబ్బాని కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఒడ్డుగూడలోని కొనుగోలు కేంద్రానికి కూడా వెళ్లి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూకంలో మోసం జరిగిన మాట వాస్తవమే అని తేలడంతో కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడె నారాయణను బాధ్యతల నుండి తొలగించామని, ఆయన సస్పెండ్‌కు కూడా పై అధికారికి నివేదిక పంపించినట్లు ఈ సందర్భంగా రబ్బాని విలేకరులకు వివరించారు.

పచ్చిక అనుకొని నాటు బాంబు తిన్న ఎద్దు



నవతెలంగాణ-కౌటాల

మేత కోసం బయటకు వచ్చిన ఎద్దు అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబును తినడంతో మూతికి తీవ్ర గాయమైన సంఘటన మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు ఎలుములె జిత్రు తెలిపిన వివరాల ప్రకారం.. తన ఎద్దు మేత కోసం వెళ్లి గుర్తు తెలియని వ్యక్తులు అడవిపందుల కోసం తయారు చేసిన నాటుబాంబును తిని ఎద్దు మూతి పగిలిపోయింది. సుమారుగా ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, దానికి ప్రస్తుతం గడ్డి మేయడం కానీ, నీరు తాగరాదని, ఇలాంటి నాటుబాంబులు తయారుచేసే దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటీవల ముత్తంపేట్ గ్రామానికి చెందిన మరో రైతు మార్చి నెలలో అతను రూ.20 వేలు పెట్టి కొనుగోలు చేసిన ఎద్దు 15 రోజులకే అడవి పందులకు పెట్టిన నాటుబాంబు తిని మూతి పగిలిపోయి చనిపోయింది. ఇలానే కొనసాగుతూంటే మరికొంతమంది రైతులు బలికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పందుల షికారి, నాటుబాంబులు తయారుచేసే దుండగులను గుర్తించాలని బాధితులు వేడుకొంటున్నారు.

చెస్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థుల మేదోశక్తిని పదును పెట్టేలా నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఆసిఫాబాద్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతప్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో చెస్ కోచింగ్ క్యాంపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోచింగ్ క్యాంపు నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. పిల్లలు చేడు అలవాట్లు దూరంగా ఉండాలని అన్నారు. చదరంగం ప్రపంచ ఆటలలో ప్రఖ్యాతి వహించందని తెలిపారు. చెస్ ఆటలో మేదోశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళనైపుణ్యం కలిసి ఉంటాయన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మలరాజ్ శ్రీనివాస రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మెగా ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-నిర్మల్

గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం నిర్మల్ డిపోలో మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. ఈసీజీ, బీపీ, షూగర్, కొలస్ట్రాల్, కిడ్నీ లాంటి పలు రకాల పరీక్షలకు రక్తనామునాలను సేకరించారు. సుమారు 72 మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రముఖ దేవిబాయి క్రిటికల్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలిస్ట్ డా.చంద్రిక, డా.విద్యాసాగర్ రావులు ఉద్యోగులు, కార్మికులను పరీక్షించి సూచనలు చేశారు. కార్యక్రమములో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయిస్తాం : గొల్ల రాజు



నవతెలంగాణ-బోథ్

అకాల వర్షంతో తడిసిన జొన్న పంటలను కొనుగోళు చేయించేలా కృషి చేస్తామని సొసైటి డైరెక్టర్ గొల్ల రాజు యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో జొన్న పంట అకాల భారీ వర్షంతో తడిసి పోవడంతో ఆయన పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. రైతులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో జొన్న పంట తడిసి పోయిందని, కోతకు వచ్చిన పంట సైతం తడిసిపోవడం జరిగిందన్నారు. రైతు సమస్యను గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల క్రితమే తడిసిన ధాన్యాన్ని సైతం కొంటామని ప్రకటించారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి జొన్న పంట కొనుగోలు చేసే విధంగా చుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రైతులు పాల్గొన్నారు.

నమూనా పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

టీఎస్పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బీసీ అభివృద్ధి అధికారి కే.రాజాలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అర్హత గల అభ్యర్థులు గ్రూప్ -1(ప్రిలిమ్స్) ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్) 2024 ఆఫ్‌లైన్ హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 08732-221280కు సంప్రదించాలని పేర్కొన్నారు.

నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్

నవతెలంగాణ-నస్పూర్

టీఎస్‌పీఎస్సీ, గ్రూప్-1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షలకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అర్హత గల అభ్యర్థులకు నమూనా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. టీఎస్‌పీఎస్సీ, గ్రూప్-1 నమూనా పరీక్షలను ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీలలో, యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ నమూనా పరీక్షలను హైదరాబాద్‌లో ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 08732-2212805లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ అందె నాగ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదిలోపు ఇంటర్ ప్రవేశాల కోసం టీఎస్‌మోడల్‌స్కూల్.కామ్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్యతో పాటు ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, ఓకేషనల్, డిజిటల్ పద్ధతిలో బోధన, బాలికలకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

రిమ్స్‌లో కలకలం

- పేషెంట్ కేర్ ఆత్మహత్యాయత్నం
- విధులు బహిష్కరించి సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన
- సూపర్‌వైజర్ వేధింపులే కారణమని ఆరోపణ
- కమిటీ వేసి విచారణ జరుపుతామన్న డైరెక్టర్


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆత్మహత్యాయత్నం చేసుకున్న మహిళ కార్మికురాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పేషెంట్ కేర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గణపతి లక్ష్మీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున రిమ్స్‌లోనే ఆమె ఫినాయిల్ తాగింది. గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి ఎంఐసీయూ వార్డుకు తరలించారు. సూపర్వైజర్ బెదిరింపులు తట్టుకోలేకనే ఆమె ఆత్మహత్యాయత్నం చేసినట్టు కార్మిక సంఘాల నాయకులు, ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బంది ఆరోపించారు. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ ఆసుపత్రికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కార్మికులపై వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్న సూపర్వైజర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. పేషెంట్ కేర్ ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన భరోసా కల్పించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

బాధితురాలిని ఆదుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రిమ్స్‌లో ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో పేషంట్ కేర్‌గా పనిచేస్తున్న గణపతి లక్ష్మీ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో బాధితురాలికి న్యాయం చేసి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులందరూ విధులు బహిష్కరించి రిమ్స్‌లో నిరసన తెలిపారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కార్మికురాలిని రాత్రి 10:30 గంటల ప్రాంతంలో హెడ్ సూపర్‌వైజర్ అకారణంగా పనిలో నుండి వెళ్లిపొమ్మనడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఘటనకు బాధ్యులైన సూపర్‌వైజర్‌ను విధుల నుండి తొలగించాలని, బాధితురాలికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. ఆమె కోలుకుని విధుల్లో చేరేంతవరకు వేతనంతో కూడిన సెలవులు అందించాలని డిమాండ్ చేశారు. కారకులపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ నవీన్‌కుమార్, అగ్గిమల్ల స్వామి, రిమ్స్ నాయకులు పెర్క దేవిదాస్, అక్రమ్‌ఖాన్, సుభాష్, దశాంత్, రమేష్, శేఖర్, ఖలీల్, సుమన్‌తాయి, రాణి, అనసూయ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ వేసి విచారణ జరిపిస్తాం : డైరెక్టర్

రిమ్స్‌లో పని చేస్తున్న పేషెంట్ కేర్ లక్ష్మీ ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన ఘటనపై త్రిసభ్య కమిటీ వేసి విచారణ జరిపిస్తామని రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్ తెలిపారు. బాధితురాలు లక్ష్మీని రిమ్స్ ఎంసీయూ వార్డులో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. త్రిసభ్య కమిటీ సభ్యులతో పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఆమెకు ప్రాణాపాయం తప్పిందని, చికిత్స పొందుతోందని తెలిపారు.


రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు


కార్మికురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

రైతులు దళారుల ఉచ్చులో పడకుండా

అప్రమత్తంగా ఉండాలి

- వ్యవసాయ ముడి సరుకుల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి
- నేలలో సరైన తేమ ఉన్నప్పుడే పంట విత్తు కోవాలి
- గ్రామ స్థాయిలో లూజుగా విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు



నవతెలంగాణ-పెంబి

రబీ పంట కోతలు చివరి దశకు చేరుకోవడంతో రైతులు ఇప్పుడే ఖరీఫ్ పంట కొరకు కావాల్సిన తమకు నచ్చిన బ్రాండ్‌కు చెందిన వ్యవసాయ ముడి సరుకులను సేకరించుకునే పనిలో ఉన్నారని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం క్లస్టర్ పరిధిలోని తాటిగూడ, పులగం పాండ్రి గ్రామాలలో రైతులకు ఖరీఫ్ సాగు సమయాత్తంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ కొంత మంది రైతులు తమకు కావాల్సిన విత్తన బ్రాండ్‌ల కోసం విత్తన వ్యాపారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకోవడాన్ని గమనిస్తున్నామని, ఇలా చేయడం వల్ల ఆయా విత్తనాల బ్రాండ్‌ల కృత్రిమ కొరత ఏర్పడటానికి రైతులే అసలు కారణం అవుతారని రైతులకు వివరించారు. తొలకరి వర్షాలకు ఎవరూ కూడా విత్తనాలు విత్తు కోవద్దని సూచించారు. నేలలో సరైన తేమ ఉన్నప్పుడు విత్తు కుంటే మొలక శాతం బాగుంటుందని తెలిపారు. బరువైన నేలల్లో 70 మి.మీ. తేలికపాటి నేలల్లో 60 మి.మీ వర్షపాతం పడిన తర్వాతే పంట విత్తు కోవాలని సూచించారు. గ్రామస్థాయిలో తిరుగుతూ లూజుగా విత్తనాలు, పురుగుమందులు అమ్మే నకిలీ వ్యాపారుల ఉచ్చులో పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు కనిరామ్, బద్ధిబాయి, అంబాజీ, శ్రీనివాస్, దేవుజీ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-తాండూర్

జూన్‌లో చేపట్టే హరితహారం కార్యక్రమానికి ముందస్తు చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారావు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. చెట్టు నాటే స్థలాలను గుర్తించి గుంతలలు తవ్వాలని సూచించారు. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వస్తున్న నేపథ్యంలో జూన్ మాసంలో మొక్కలు నాటేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో 150 మంది ఉపాధి హామీ కూలీలు హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనుల నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నందకుమార్, ఎంపీఓ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు అరుణ్, లక్ష్మి, రాజేంద్రప్రసాద్, భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలపై దాడులు ఆపాలి

నవతెలంగాణ-మందమర్రి



ఆర్ఎంపీలపై జరుగుతున్న టీఎస్ఎంసీ దాడులను ఆపి శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆర్ఎంపీలు డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్ఎంసీ ఆధ్వర్యంలో ఆర్ఎంపీలపై తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో ప్రాథమిక వైద్యుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలకు రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో 429/1273 జీఓ ద్వారా ప్రభుత్వ వైద్యులతో శిక్షణ ఇచ్చారని తెలిపారు. పరీక్షలు నిర్వహించే సమయంలోనే మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణంతో శిక్షణ నిలిచిపోయిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్ఎంపీలకు ఇచ్చి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని మ్యానిఫెస్టోలో మాట ఇచ్చి విస్మరించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్ఎంపీలకు శిక్షణతో పాటు గుర్తింపు ఇస్తామని మ్యానిఫెస్టోలో హామి ఇచ్చి కాలయాపన చేస్తోందన్నారు. ఆర్ఎంపీలపై జరుగుతున్న తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) దాడులను ఆపి శిక్షణతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగు రవీందర్, మందమర్రి పట్టణ అధ్యక్షులు కట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, కోశాధికారి లక్ష్మణ్, మంద తిరుమల్ రెడ్డి, టి.రవికుమార్, ఆర్.వెంకటేషం, మతిన్ ఖాన్, గోనే సత్యం, జె.రవి, పోశం, సత్యనారాయణ, దామోదర్, సాంబమూర్తి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలం రోటిగూడ గ్రామంలో రోటిగూడ సామాజిక సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం గోనే రామక్క కుమారుడు గోనె నరసయ్య అనారోగ్యంతో చనిపోయారు. నిరుపేద కుటుంబం కావడంతో సామాజిక సంక్షేమ కమిటీ గోనె రామక్క కుటుంబానికి బుధవారం రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ పాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరం మహాశివరాత్రి రోజు ఏర్పాటు చేసుకున్న సామాజిక సంక్షేమ కమిటీ దాతల విరాళాలతో నిరుపేదలను ఆదుకుంటుందన్నారు. పుట్టిన, పెళ్లి రోజులు, శుభకార్యాలు, పండగలకు విరాళాలు సేకరిస్తామన్నారు. సేకరించిన వాటిని అర్హులైన నిరుపేదలను గుర్తించి అందిస్తామన్నారు. కార్యక్రమంలో గాజుల సత్తయ్య, ఉప్పు శ్రీనివాస్, గోనె గట్టయ్య, శివనూరి శ్రీనివాస్, పాదం రాజిరెడ్డి, ఉప్పు నర్సింగ్, పులిశెట్టి లవన్ కుమార్, నీరటి మల్లేష్, గోనె గోపాల్, ములంగిరి చంద్రయ్య, గోనె రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన కలవెన సంపత్ అనే వ్యక్తి ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమార్తె 9వ తరగతి, బాబు ఎల్‌కేజీ చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక సాయం ఎదురు చూస్తున్నారని తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి.లక్ష్మణ్, కోశాధికారి టీ.సురేష్, ప్రచార కార్యదర్శి శరత్ బాబు, ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ సబ్ స్టేషన్‌లోని టౌన్-4, టౌన్-5 ఫీడర్లలో మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 16న ఉదయం 09 నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నమ్రత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని భుక్తాపూర్, అంబేద్కర్ చౌక్, గాంధీ జోక్ శివాజీ చౌక్, పంజాబ్ చౌక్, పంజేషా, రైల్వే స్టేషన్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ కొత్త గుడిసెల ప్రాంతంలోని పోచమ్మ పునర్నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలను అందించారు. శిథిలావస్థలో ఉన్న గుడిని తిరిగి నిర్మించాలనే ఉద్దేశంతో స్థానికులు విరాళాల సేకరణ చేపట్టారు. పలువురు దాతలు ముందుకు తమ విరాళాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎలక రామచందర్ రూ.51,116, లక్ష్మణ్ రూ. 37,500 అందించారు. దాతలు అందించిన విరాళాలతో ప్రజలందరి సహకారంతో ఆలయ నిర్మాణం పనులు పూర్తిచేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలుక రామచందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు మద్దిబోయిన గోపాల్, పురంశెట్టి శంకర్, వావిలాల రమేష్, కటకం శ్రీనివాస్, సప్ప హరీష్, పుల్గం శ్రీకాంత్, గోలేం వంశీ, సిద్ధం సాయి శంకర్ ఇడిదినేని లక్ష్మణ్ పాల్గొన్నారు.

సిరికొండలో గాలివాన బీభత్సం



నవతెలంగాణ-సిరికొండ

సిరికొండలో గాలివాన బుధవారం బీభత్సం సృష్టించింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి తీవ్ర గాలులువీస్తూ వర్షం కురిసింది. పలు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. సిరికొండ నుండి వాయిపెట్ వెళ్లే దారిలో తీవ్రగాలుల వల్ల చెట్టు రోడ్డుపై పడిపోయింది. దీంతో చిమ్మన్‌గుడి నుంచి రోగి తీసకువస్తున్న క్రమంలో చెట్టు పడిపోవడంతో 108 కొంత సేపు ఆగింది. 108 సిబ్బంది ట్రాక్టర్ సహాయంతో రోడ్డుపై పడి అన్న చెట్టును తొలగించి పేషంట్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అనుమతి లేని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో అనుమతి లేని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ అన్నారు. బుధవారం డీఈఓకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ప్రయివేటు పాఠశాలలు పుట్టుకొస్తున్నాయన్నారు. గతంలో పాఠశాలలపై ఫిర్యాదు చేయడంతో ఆ సమయంలో తాత్కాలిక చర్యలు తీసుకున్నారన్నారు. మళ్లీ ఈ విద్యా సంవత్సరంలో అవి యధావిధిగా కొనసాగుతున్నాయన్నారు. సీబీఎస్ఈ సిలబస్ అనే పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వేల రూపాయలను దోచుకుంటున్నారన్నారు. అనుమతులు లేని పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, విద్యా బోధన, పాఠశాలలకు సంబంధించి, నిబంధనలతో కూడిన సూచనలు తెలుపుతూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.